# మాక్స్ ముల్లర్

"ఏ ఆకాశం క్రింద మానవమేధ తనలోని కొన్ని నిగూఢశక్తుల సత్యద్భుతంగా వికసింపజేసింది? ఏ దేశం జీవితంలోని అతి గంభీరమయిన సమస్యలగురించి క్షుణ్ణంగా ఆలోచించింది? ఆ సమస్యలు కొన్నింటికి ప్లేటో, కేంట్‌లను చదివినవారు సైతం తెలుసుకోవలసిన పరిష్కారాలను ఏజాతి సాధించింది?. అని నన్నడిగితే భారతదేశం అని చెబుతాను. మన జీవితాలను పరిపుష్టంగా, పరిపూర్ణంగా, విశ్వజనీనంగాచేసి ఇంకొక శాశ్వత జీవితాన్ని ప్రసాదించగల సాహిత్యం ఎక్కడుంది? - అని అడిగితే భారతదేశంలో అంటాను నేను."

సరిగ్గా 98 సంవత్సరాల క్రితం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో "ఇండియా-వాట్ కెన్ ఇట్ టీచ్ అజ్?" అన్న శీర్షిక క్రింద ఇచ్చిన ప్రసంగాలలోని మొదటిదానిలో పైవిధంగా చెప్పినవాడు ఫ్రెడరిక్ మాక్స్ ముల్లర్.

ఆనాటి భారతజాతి రాజకీయ బానిసత్వంలో, మూఢాచారాల అమవసి నిశిలో, అజ్ఞాన తిమిరంలో-జీవచ్ఛవంగా వుండింది. ఆలాంటి జాతికి, తన్ను తాను తెలుసుకొమ్మని వెన్ను తట్టిన వెలుగుదీపంగా మాక్స్ ముల్లర్.

1823 డిసెంబర్‌లో తూర్పుజర్మనీలో పుట్టిన ముల్లర్, ఇంగ్లండులో 1900 అక్టోబరులో కన్నుమూశాడు. ఆయన మాతృభాష జర్మన్ అయినా ఆయన 55 సంవత్సరాల పాటు నివసించిన ఇంగ్లండు దేశపు భాష అయిన ఇంగ్లీషులోనే ఆయన రచనలుచేశారు.

"ప్రాచ్యదేశాల పవిత్ర గ్రంథాలు" అన్న శీర్షిక క్రింద 25 సంవత్స రాలు కృషిచేసి 4 సంపుటాలు వెలువరించిన మహాతపస్వి ముల్లర్.

శాయనుడి వ్యాఖ్యానంతో 'ఋగ్వేదాన్ని' ఆరు సంపుటాల్లో ప్రచురిం చింది ఆయనే.

ఇవిగాక "పౌరాణికగాథల ప్రేరణలు" అనే 864 పుటల్లో రెండు పుస్తకాలు, "శబ్దాల జీవిత చరిత్రలు", "ప్రాచీన సంస్కృత వాఙ్మయ చరిత్ర" వంటి పుస్తకాలూ రచించిన ఈమనిషి సాధనకు ప్రేరణ ఏమిటి? ఒక వ్యక్తి జీవితంతో ఇంతటి బృహత్ రచనా వ్యాసంగం సాధ్యమా?

ఇది తెలుసుకోవాలంటే మాక్స్ ముల్లర్ తన ఏకైక పుత్రుడు విల్‌హెల్మ్ గ్రెన్‌ఫెల్‌కు రాసిన వుత్తరం చూడాలి! అందులో ఆయన-

"జీవితంలో అనుభవించ దగిన సరదాలను అనుభవిస్తూనే ఒకానొక వ్యక్తి, ఆశయ సాధన-దేని మీదో ఒక దానిమీద మమకారం పెంచుకోవాలి ఇది ప్రేమయై, సాధనయైతపస్సు కావాలి. అలాంటిది లేని జీవితం గానుగెద్దు జీవితం అవుతుంది."

అలాంటి ప్రేమ ఆయనలో ప్రాచ్యదేశాల, ముఖ్యంగా భారతదేశపు ప్రాచీన సాహిత్యం మీద ఏర్పడింది.

ముల్లర్ చిన్నబ్బాయిగా బడిలో చదువుకుంటున్నప్పుడు అతడి నోట్ పుస్తకం ఒకదాని వెనుకట్టమీద వారణాసి బొమ్మ కన్పించింది. స్త్రీలు, పురుషులు, పిల్లలు గంగానదిలో స్నానం చేస్తున్న ఆ దృశ్యం ఎందుకో ఆ బాలుడి మనస్సును ఆకట్టుకుంది?

అదివరకే భారత దేశంగురించి "సతీసహగమనం" గురించి కొద్దిగా విన్న ఆ కుర్రవాడు ప్రొఫెసర్ బ్రోకస్ అన్న గురువు దగ్గర సంస్కృత నేర్చు కోవడం మొదలు పెట్టాడు. యువకుడిగా పారిస్‌లో వుండగా ముల్లర్ దేవేంద్రనాథ్ టాగూర్ (రవీంద్రుడి తాతగారు) ని కలిసేవాడు. ఒకసారి

సంగీతప్రియుడయిన ముల్లర్ టాగూర్‌ని పాడమంటే ఆయన పర్షియన్ పాట పాడాడు.

"అది కాదు మీ సంగీతం వినాలని వుంది-" అని కోరాడు. ముల్లర్. ముల్లర్ బలవంతం మీద టాగూర్ పియానో వాయిస్తూ ఒక పాట పాడాడు కాని, దాని మాధుర్యం, రాగం ఏదీ ముల్లర్‌కి అర్థం కాలేదు.

అప్పుడు టాగూర్ చెప్పాడు: "మీరందరూ అంతే! మీకు ఏదన్నా కొత్తగా అనిపిస్తే దాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించక మొహాలు తిప్పేసుకుంటారు. నేను మొదట ఇటాలియన్ సంగీతం విన్నప్పుడు నాకూ అలాగే అన్పించింది. కాని ప్రయత్నించగా ప్రయత్నించగా నాకు అది అర్థం కాసాగింది. దాని మీద ఇష్టం ఏర్పడసాగింది ఏ విషయమయినా అంతే. దాని గొప్పదనం ఎంతదయినా మనలో ఆ ప్రయత్నం కావాలి. అది లేకుండా మీరు మా మతం మతం కాదని, కవిత కవిత కాదని, తత్వశాస్త్రం తత్వశాస్త్రం కాదని అనుకుంటారు. యూరప్ జ్ఞాన విజ్ఞానాలతో బాటు మా కళలను, శాస్త్రాలను కూడా మేము తెలుసుకుని గౌరవిస్తాం. మీరు మా జ్ఞానాన్ని కళలను అధ్యయనం చేస్తే మీరంటున్నట్లుగా మేము అజ్ఞానులం కాదనీ, తెలియని దానిమీద మీరెంత తెలుసుకున్నారో మేమూ అంతే తెలుసుకున్న వారమనీ, కొన్ని రంగాలలో మీకన్నా లోతుగా వెళ్ళగలిగామనీ తెలుసుకో గలరు''

ఈ ప్రసంగం మాక్స్ ముల్లర్ ఆలోచనలను అమితంగా ప్రభావితం చేసింది. భారతదేశం మీద ఆయన ప్రేమ భారత దేశపు నాగరికత మీదకు అక్కడ నుండి భారతీయుల మీదకు మళ్ళింది. ఆ ప్రేమ ఈ దేశపు అమూల్య సాహిత్యాన్ని పాశ్చాత్యులకు అరచేతిలో ఒలిచి పెట్టింది. భారతీయులకూ కనువిప్పు కల్గించింది.

ఆయన అర్థం చేసుకున్న భారతీయతగాక- ఆయనకు భారత దేశంలో కరడు గట్టుకుపోయిన మౌఢ్యం, మతం పేరిట వేయి వెర్రితలలు, భ్రష్టా

దారాలూ, కల్మషం కనపడ్డాయి. ఆయన భారత దేశం మీద పాదం మోపలేదు గానీ ఇక్కడి మనుషులను, ఆనాటిపరిస్థితులను చూచివుంటే మరింతగా కుంగి పోయేవాడు. అలా చీకటిలో మగ్గుతున్న భారతీయులకు ఒకప్పటి వారి జ్ఞాన దీపాలను గుర్తుచేసి, మసిబారిన ఆ వత్తులను చిదిపి, ఆ ప్రమిదలలో తైలాన్ని నింపడానికి ఆయన తన జీవితాన్ని వెచ్చించాడు. అధ్యయనాన్ని ఇంత ఏకాగ్రతతో చేపట్టిన ముల్లర్ తన భార్యను పిల్లలకు అంతే తీవ్రతతో ప్రేమించాడు. పెళ్ళికి ముందు అయిదేళ్లపాటు జార్జినా గ్రెన్‌ఫెల్‌ని తెలిసి పరిచయం పెంచుకున్న ముల్లర్ అనేక అడ్డంకులను దాటి 1859 ఆగస్టులో ఆమెను వివాహమాడగలిగాడు.

ఆయన ఎప్పుడు పనులమీద బయటి వూర్లకు వెళ్ళినా ఆమెకు ఉత్తరాలు రాసేవాడు, చిన్నచిన్న కానుకలు తెచ్చేవాడు. అలాంటి ఒక వుత్తరంలో- "నేను ఎంత నీవాడివో, నువ్వు అంత నాదానివి. అంటే నేను నీకు యజమాని అనో, నువ్వు నా యజమానురాలిన అనో కాదు. నిన్ను నాకు, నన్ను నీకు భగవంతుడు కానుకలుగా ఇచ్చాడు. నీతోటి నా జీవితమే స్వర్గం అనీ, శాశ్వతం అనీ అన్పిస్తుంది నాకు!" అని హృదయం విప్పి చెప్పాడు ఆయన.

ఆ ప్రేమైకజీవులకు ముగ్గురమ్మాయిలు, ఒకబ్బాయి పుట్టారు. ఆ పిల్లలనూ అత్యంత ప్రేమానురాగాలతో లాలించి పెంచిన ముల్లర్ జీవితం చూస్తే "కామిగాక మోక్షగామి గాడు" అని వేమన-అన్నదాని అర్థం ఇట్టే తెలుస్తుంది.

అందరు మేధావులవలెనే సమాజంలోన విలువలు చూసి అసహ్యం వేసేది ముల్లర్‌కు.

"ఎంత డబ్బు ఇచ్చినా ఈ లండన్‌లో నేనుండను. ఈ చప్పుడు, ఈ గోల, ఈ విందులు, ఊసుపోక కబుర్లు, నటనలో. అహంభావ ప్రదర్శనలో ఒకరిని మించాలని యింకొకరు పడే పోటీలు-అబ్బబ్బా! జుగుప్సాక

రంగా వున్నాయి" అని రాశాడాయన తన భార్యకు రాసిన ఒకవుత్తరంలో ఈనాటి మన నగరాల జీవనం యింతకన్న భిన్నంగా వుందనగలమా.— ?

ఇంకొకసారి – "ఈ సంఘం సంఘం అంటారే దానికన్న అభూత కల్పన యింకోటివుండబోదు. అసలు సంఘం అనేది ఏదీలేదు. మూర్ఖత్వం, అహం, అబద్ధం-ఈ మూటి కలయికే సంఘం ... .... జీవితం వేరు...., సంఘం వేరు .. కాని దురదృష్టం ఏమిటంటే సంఘం జీవితాన్ని నమిలి మింగుతుంది!" అన్న వాక్యాల వెనక ఎంత బాధ, ఎంత అనుభవం వుంది. ఇది తెలియడానికి జీవితమంతా ఖర్చుచేసిన వారెవరున్నారు!

చార్లెస్ డికెన్స్, డార్విన్, టెన్నిసన్, బ్రౌనింగ్, జాన్‌రస్కిన్, వివేకానంద, పండిత రమాబాయ్, లార్డురిపన్‌లవంటి హేమహేమీలతో సంబంధ బాంధవ్యాలు నెరపిన ముల్లర్ జీవితంలో అనేక రగడలు, నిరాశలు దుఃఖాలుఎదురయ్యాయి. ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయంలోని సంస్కృత పీఠంలోని "బోడెన్ ఆచార్యపదవికై మరొక గొప్ప సంస్కృత విద్వాంసుడు మోనియర్ విలియమ్స్, మాక్స్‌ముల్లర్ తలపడిన పైనం పెద్ద రాజకీయ యుద్ధంగా మారింది. చివరకు ముల్లర్ ఓడిపోయాడు. ఆక్స్‌ఫర్డు నుండి రాజీనామా చేసి వెళ్ళిపోదాం అనుకున్నాడుగాని అక్కడి వారు ఆయనని వదలుకోవడం ఇష్టంలేక ఆయనకు తగినవేతన సౌకర్యాలతో ఇంకొక పదవి నిచ్చి ఆయనని నిలుపుకున్నారు.

మానవజాతి పుట్టు పూర్వోత్తరాలను విశ్లేషించి ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన డార్విన్‌కు మాక్స్‌ముల్లర్‌కు మధ్య ఆ విషయం మీదే అభిప్రాయభేదాలు వచ్చాయి. ముల్లరు డార్విన్ ఇంటికి వెళ్ళాడు. ఇద్దరూ నిర్మొహమాటంగా చర్చించుకున్నారు. ముల్లరు లేచివెళ్ళిపోతుండగా డార్విన్ నవ్వుతూ ఆయనచేతులు పట్టుకుని — "మీరు చాలా ప్రమాదకరమైన వారు !" అంటే, ముల్లరు – "ఇద్దరం సత్యాన్వేషులమే గనుక ప్రమాదానికి ఆస్కారం లేదు" అన్నాడు. ఇంకొకసారి డార్విన్ అభిప్రాయాలను

తునాతునియలుచేసే వ్యాసాన్ని ముల్లరు ఆయనకు పంపగా, డార్విన్- "మీ వ్యాఖ్యలు కొన్ని బాణాల్లా నిశితంగా తగిలినా నా మనసు "ఇవాళ సాక్షాత్తు రాజుగారే నన్ను చావబాదారు సుమా" అని మురిసిపోతూ చెప్పు కున్న కథలోని వ్యక్తిలా వుంది" అని రాశాడు.

ఎంతటి మహోన్నత సంస్కారం! ఇంతలా జీవితాన్ని జీవించి సాహిత్యాన్ని సేవించిన వ్యక్తి గుడ్డి ఆరాధనాపరుడని అనుకుంటే అది పొరబాటు కాగలదు. "విశ్వాసానికీ మతానికీ నాస్తికతను మించిన టానిక్ లేదు." అని నిర్వచించిన ముల్లర్ ఇట్లా వివరించాడు. "నాస్తికతలో రెండు రకాలున్నాయి ఒకటి మృతప్రాయం, ఇంకొకటి అమృతప్రాయం. ఈ రెండవ రకం నాస్తికత అన్ని విశ్వాసాలకు జీవాధారం వంటిది. మన జీవితంలో కొన్ని విషయాలు స్పష్టంగా అర్థమయిన క్షణాలలో మనం అంతవరకు నమ్మిన వాటిని వదిలివేయగల శక్తి నిచ్చేది ఈ రెండవ రకం నాస్తికతే! మనకెంత నచ్చినా, ఎంత ప్రియమయిన దయినా అంత కన్న మేలైన ఆలోచన, వాస్తవం, విషయం ఎదురయినప్పుడు పాతదాన్ని వదలివేయాలి. అదే శరణాగతి, త్యాగం, విశ్వాసం—" అన్నాడు ఆయన! అనగా నాస్తికత నెగిటివ్ మీద పాజిటివ్ ప్రింట్లు తీయాలని సూచించా డన్నమాట.

మాక్స్ ముల్లరుని "మోక్షమూలరు" అంటూండడం గమనించి మనం - ఈ చాదస్తపు హిందువులు అన్నింటిని సంస్కృతంలోకి మార్చు కుని చంకలు కొట్టుకుంటారుగా, అందులో ఇది ఒక భాగం-" అని కొట్టి పారేస్తాం. కాని "ట్రూత్ ఈజ్ స్ట్రేంజర్ దన్ ఫిక్షన్" గనుక అవ ధరించండి.

1849 లో ప్రచురించిన ఋగ్వేదపు మొదటి సంపుటపు రెండవ టైటిల్ పేజీమీద మాక్స్‌ముల్లరు - "భట్ట మోక్ష మూలరేణ సంశోధితా" అని రాసుకున్నాడు. అంతేకాదు జర్మనీని "శార్మణ్య దేశం" గాను, ఆక్స్ ఫోర్డును "ఉక్షతరణం" గాను పేర్కొన్నాడు.

మొదటిసారిగా గ్రామఫోన్ రికార్డింగ్ పద్ధతి కనుగొన్నప్పుడు, మాక్స్ ముల్లరుని రికార్డుకోసం ఏదయినా పలకమన్నప్పుడు - ఆయన "అగ్నిమీళే పురోహితమ్" అన్న ఋగ్వేదంలోని శ్లోకాన్ని చదివారట.

స్వామి వివేకానంద - మాక్స్ ముల్లరుని భారత దేశపు మిత్రుడిగా వర్ణించాడు.

ఆయన జబ్బుతో వున్నాడని తెలిసి ఆయన కృషిని అర్థం చేసుకున్న సామాన్యుడొకడు శ్రీమతి ముల్లరుకు 889 డిసెంబరు 13 న మద్రాసునుండి రాసిన వుత్తరంలో ఇలా వుంది.

"మాక్స్ ముల్లరుగారు ఆరోగ్యం కోలుకునే నిమిత్తం నేను, నాలాగే ఆలోచించే మిత్రులు కొందరూ పార్థసారథిస్వామి కోవెలలో ప్రత్యేకంగా అర్చనలు చేయించాలనుకుని కోవెలకు వెళ్ళాం. మా కోరిక విని ఆ అర్చకుడు - 'అబ్బే, హిందువుగా పుట్టనివాడిపేర అర్చనయా, వీలుకాదు. కిరస్తానీవాడిపేర పూజచేస్తే నా ఉద్యోగం వూడుతుంది మావాళ్ళు నన్ను వెలివేస్తారు" అని తిరస్కరించాడు! ... అప్పుడు మాలో ఒకరు అతడికి ఎక్కువ డబ్బులు ముట్టజెపుతామనగానే అతడు ఒప్పుకున్నాడు!'

మాక్స్ముల్లర్ ఆరోగ్యం గురించి ఈ దేశంలో ఆనాడు ఒక సామాన్యుడు తపన పడడంలో ఎంత ఔన్నత్యం వుందో అర్చకుడు మరి నాలుగు రూపాయలకోసం "చేయరానిది" అని తనే అన్నదానిని చేయబూనడంలో మతంపేరిట వ్యక్తుల అధోగతి, భ్రష్టత్వం అంత కన్పిస్తుంది.

అందుకనే యింకో సందర్భంలో ద్వారకానాథ్ టాగూరుకు రాసిన వుత్తరంలో మాక్స్ ముల్లరు — "ఇటలీలోగానీ, ఇంగ్లండులో గాని, ఇండియాలో గాని పూజారులను బట్టి ప్రచారకులనుబట్టి మతాన్ని బేరీజు వేయరాదు!- అని హెచ్చరించారు.